క్లుప్తంగా

పోలమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోల మాంబ అమ్మవారిని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చదురు గుడి, వనంగుడి ఆలయాల్లో కొలువైన పోల మాంబ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కళావతితో పాటు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు గృహానికి మాజీ ఎమ్మెల్యే కళావతి చేరుకుని పార్టీ కార్యకలాపాలపై కాసేపు ముచ్చటించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బలిజిపేట: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, వాహనాలను నడిపే వారు నిబంధనలకు లోబడి నడపాలని ఎస్సై సింహాచలం అన్నారు. ఈ మేరకు కొత్త నిబంధనలకు అనుగుణంగా వాహనాలను ఆయన పర్యవేక్షించారు. వాహనచోదకులు హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపినా, లైసెన్స్ లేకుండా, మైనర్లు వాహనాలను నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి కొత్త నిబంధనల చట్టం ప్రకారం అపరాధ రుసుము విధించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో 'మోడల్' విద్యార్థినికి రెండవ స్థానం

మక్కువ: జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో మక్కువ మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాల విద్యార్థిని సీహెచ్.హైమ జిల్లా స్థాయి వక్తృత్వపోటీలో రెండవ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఎన్. స్వర్ణలత తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి వ్యకృత్వ పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థులు హైమ, కీర్తన పాల్గొనగా, హైమ ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. మెంటర్ రత్నకుమారి అందించిన దిశానిర్దేశాలతో హైమ రెండవ స్థానం లో నిలవడంతో హైమను ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.


హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ టి. త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే నిర్వహించడంలో సిబ్బంది నిర్లిప్తత వీడి పని వేగవంతం చేయడానికి కృషిచేయాలని కోరారు. ఇప్పటికే పలు గ్రామాల్లో సర్వే పూర్తి కావచ్చిందని, కొన్ని గ్రామాల్లో సర్వే మందకొడిగా నిర్వహిస్తున్నందున ఉన్నతాధికారుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి దృష్ట్యా సర్వే వేగవంతం చేయాలని కోరామన్నారు. ఇప్పటికే ఈఓపీఆర్‌డీ గ్రామాల్లో సర్వే పనులు పరిశీలిస్తున్నారని తెలియజేశారు.

సీఆర్‌ఎంటీ వితరణ

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యేంతవరకు నిర్వహించే అదనపు తరగతుల సమయంలో వారికి స్నాక్స్‌ను వితరణగా ఇవ్వనున్నట్లు సీఆర్‌ఎంటీ శ్రీరామ్ తెలిపారు. అందులో భాగంగా సోమవారం వారికి స్నాక్స్ అందించారు. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు 25మంది చదువుతున్నారు. అదేగ్రామానికి చెందిన, మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్న శ్రీరామ్ వారిని ప్రోత్సహిస్తూ, పరీక్షల సమయంలో చదువుకునేందుకు నీరసించిపోకుండా ఉండేందుకు స్నాక్స్‌ను అందిస్తున్నారు. మంచి మార్కులతో విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి



ప్రధానోపాధ్యాయుడు ప్రకాశందొర

మక్కువ: స్థానిక ఎస్ఎన్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న టి, ప్రకాశందొర (52) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ప్రధానోపాధ్యాయుడు ప్రకాశందొరకు ఆదివారం అర్ధరాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రాగా వెంటనే కటుంబ సభ్యులు హుటాహుటిన బొబ్బిలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ద్విచక్రవాహనంపై తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావించినప్పటికీ, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆస్పత్రి వైద్యులు మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ప్రకాశందొర స్వగ్రామం కొమరాడ మండలంలోని కుమ్మరిగుంట గ్రామం. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

విశిష్ట సంఖ్యకు సాంకేతిక చిక్కులు

- అన్నదాతలకు తప్పని తిప్పలు
- డీ పట్టా రైతులకు కనిపించని ఆప్షన్
- ఒకే సర్వే నంబర్‌లో ఎక్కువ మంది పేర్లున్నా ఒక్కరికే నమోదు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో అవస్థలు

బలిజిపేట:

విశిష్ట సంఖ్య నమోదులో రైతులకు సాంకేతిక చిక్కులు తప్పడం లేదు. ఒకే సర్వేనంబర్‌లో ఎక్కువమంది పేర్లున్నా, డీ పట్టా రైతులకు ఆప్షన్ కనిపించక ఆందోళన చెందాల్సి వస్తోంది. సంక్షేమ పథకాలకు విశిష్ట సంఖ్యలింకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే రాయితీలు ఇకమీదట ఏది పొందాలన్నా రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి చేశారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్సులతో పాటు సెల్‌ఫోన్ నంబర్‌ను వీఆర్‌ఏకు అందించాలి. రైతు వివరాలను వీఏఏ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అప్పుడు వీఏఏ లాగిన్ అయి రైతుల వివరాలు సరిచూస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. దీంతో పేర్ల నమోదుకు రైతులు కేంద్రాల వద్దకు క్యూ కడుతున్నారు. భూమిని నమ్ముకున్న రైతులకు వాతావరణం అనుకూలించక, చీడపీడలతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో వారిని ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో కొన్ని అడ్డంకులు ఎదురవుతాయి. బాధితులను గుర్తించేందుకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పేరుతో ప్రతి రైతుకూ 11అంకెల ప్రత్యేక గుర్తింపు సఖ్య కేటాయిస్తున్నారు. ఆధార్ ఎంత అవసరమో రైతుకు విశిష్ట సంఖ్య కూడా రెట్టింపు అవసరమయ్యేలా రూపకల్పన చేశారు.



రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

రిజిస్ట్రేషన్లలో ఎదురవుతున్న సమస్యలివే:

- ఒకే సర్వే నంబర్‌లో అన్నదమ్ములు ఉన్నట్లయితే ఒకే పేరు వస్తోంది.
- ప్రస్తుతం భూమిలో ఒకే రైతుకు సంబంధించి వివరాలు పూర్తిచేయాలని ఆదేశాలున్నాయి.
- డీ పట్టా, దేవాదాయ, ప్రభుత్వ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కావడం లేదు.
- ఆధార్ నంబర్లు సక్రమంగా లేక రైతులకు అవస్థలు తప్పడం లేదు.
- రైతుల వివరాలు నమోదు చేసిన మొబైల్‌కు మెసేజ్ రావడానికి కొంత సమయం తీసుకోవడం.

వేలిముద్ర, ఫేషియాప్‌ను వినియోగించాలి

ఆధార్ కార్డుకు సెల్‌ఫోన్ నంబర్ అనుసంధానానికి రైతుల పేర్లను ఈకేవైసీ ద్వారా నమోదు చేస్తున్నారు. ఆ తరువాత ఓటీపీ ద్వారా వీఏఏ లింకుకు, అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి పంపడంలో జాప్యమవుతుందని, నేరుగా రైతునుంచి వేలిముద్ర లేక ముఖ ఆధారితంగా రైతు వివరాలు నమోదు చేస్తే త్వరగా ప్రక్రియ ముగుస్తుందని రైతులు అంటున్నారు.

30ఏళ్లుగా సాగుచేస్తున్నాను



గత 30సంవత్సరాలుగా డీ పట్టా భూమిని సాగు చేస్తున్నాను. ఇప్పుడు ఏదో విశిష్ట సంఖ్య అని అసలైన భూయజమానులైన వారి పేర్లు మాత్రమే రిజిస్టర్ చేస్తున్నారు. మరి మాసం గతి ఏమిటని అడిగితే అది తెలియదని అంటున్నారు. మేము రైతులం కాదా? సాగుచేస్తున్నప్పుడు మాకు నష్టాలు రావా? అప్పుడు మేము నష్టపోవాల్సిందేనా? అని రైతులు లబోదిబోమంటున్నారు.

– రామందొర, పి.రావివలస, బలిజిపేట మండలం

చైన్‌స్నాచర్ నిర్ధారణకు డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే చేస్తున్న సీసీఎస్ పోలీసు అధికారులు

సీతానగరం: మండలంలో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకునేందుకు డ్రోన్ ద్వారా నిఘా చేపట్టినట్లు ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జానుమల్లు వలస గ్రామంతో పాటు పరిసర గ్రామాలు, బలిజిపేట మండలంలోని పలు గ్రామాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పట్టుకోవడానికి సీతానగరం పోలీసు యంత్రాంగం తీవ్రంగా గాలిస్తోందని చెప్పారు. నిందితుడు నల్లని పల్సర్ మోటార్ బైక్‌పై ముఖానికి నల్లని మాస్కు ధరించి, హెల్మెట్ పెట్టుకుని తనను గుర్తించకుండా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నాడన్నారు. బస్సుకోసం లేదా పొలం పనుల కోసం వెళ్తున్న ఒంటరి మహిళలతో ఆ వ్యక్తి మంచిగా మాట్లాడి బండిపై లిఫ్ట్ ఇస్తానని నమ్మించి కొంత దూరం తీసుకువెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాన్ని తెంచుకుని పారిపోతున్నట్లు తెలిపారు. ఈ సంఘటన గతంలో సీతానగరం ప్రాంతంలో జరిగినందున ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశాల ప్రకారం సీసీఎస్ ఏఎస్సై బెడ్‌సన్, హెచ్‌సీ రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రోన్ హ్యాండ్లర్ దేముడు బాబు ఆధ్వర్యంలో సదరు నిందితుడ్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో గొలుసు దొంగతనాలు జరిగినా, సారా తయారు చేసినా, పేకాట ఆడుతున్నట్లు తెలిసినా డయల్ 100 లేదా 112 నంబర్లకు లేదా అందుబాటులో ఉన్న పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

రూల్స్ మారాయి.. తస్మాత్ జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: కొత్తగా ట్రాఫిక్ రూల్స్ మారాయని ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చాయని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిందేనని సీతానగరం ఎస్సై ఎం.రాజేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సీతానగరం మండల కేంద్రం జానుమల్లువలస, కేఎస్‌పురం గ్రామాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని, లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు హెల్మెట్‌లు ధరించాలని లేకుంటే ఒక్కో వ్యక్తికి రూ.వెయ్యి చొప్పున రూ.2వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. అదే వ్యక్తులు రెండవ పర్యాయం హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తే రూ.5వేలు జరిమానా ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వారి వ్యక్తిగత భద్రత దృష్ట్యా హెల్మెట్‌లు ధరించాలని హితవు పలికారు.

కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి



పోస్టు బాక్సులో ఉత్తరాలు వేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యలను లేఖ రూపంలో ప్రభుత్వానికి తెలియపరిచేందుకు పోస్టుబాక్సులో ఉత్తరాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దుచేస్తున్నట్లు మంత్రి మండలి ప్రకటించిందని, ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేసిన ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ వచ్చిన తరువాత పీఎఫ్, ఈఎస్ఐ, గ్యారంటీ ఉందని ఈ విధానం రద్దుచేస్తే కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే భారీఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నాయకులు ఎస్.మల్లేష్, జి.గుంపస్వామి, నిర్మల, సాగర్ పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలి



ర్యాలీగా వస్తున్న వ్యవసాయ కార్మికసంఘం, ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు, గిరిజనులు

పార్వతీపురం: ఎన్నోఏళ్లుగా గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ర్యాలీగా ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుని ఐటీడీఏ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. తరతరాలుగా పేదలు, గిరిజనులు సాగుచేస్తున్న ప్రభుత్వ బంజరు భూములకు డీ పట్టాలు మంజూరు చేయాలని అన్యాక్రాంతమైన పేదల పట్టా భూములను తిరిగి ఇవ్వాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. లేకుంటే మరో వారం రోజుల్లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమంతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆందోళన చేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొల్లుగంగునాయుడు, జిల్లా సెక్రటరీ బి.రాము, నాయకులు కద్రక చిరంజీవి, మెల్లిక రాము, మెల్లిక బాషా, వరాలు తదితరులతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

భూములు తీసుకోవడం సరికాదు

పార్వతీపురం: ఎన్నోఏళ్లుగా సాగు చేస్తున్న కొండ పోరంబోకు భూములకు ఆర్ఓఎఫ్‌ఆర్ పట్టాలు, లీజు పట్టాలు ఉన్నప్పటికీ అటవీశాఖాధికారులు వాటిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని గిరిజన, దళిత, వెనుకబడిన సామాజిక వర్గాల రైతులు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కార్యాలయం ఆవరణలో సీతానగరం మండలం అప్పయ్యపేట, పెదభోగిలి పంచాయతీలకు సంబంధించిన ఎస్టీ, ఎస్సీ, బీసీకి చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా భూముల్లో జీడి, మామిడి, టేకు తదితర చెట్లను పెంచుతూ జీవనాధారంగా బతుకుతున్నామన్నారు. అయితే ఆ భూములను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకుంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమి తప్ప తమకు ఎలాంటి ఆధారం లేదని, ప్రభుత్వం ఇచ్చిన భూములను మళ్లీ అటవీశాఖ తీసుకోవాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అటవీశాఖ అధికారుల తీరుపట్ల విస్మయం చేశారు. అధికారుల నిర్ణయాన్ని పునరాలోచన చేసి తమను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు మంచి చేతిరాత నేర్పించాలి



అజ్జాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థులకు మంచి చేతిరాతను నేర్పించాలని ఎంఈఓ–1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అజ్జాడ, మురగడాంలలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి వాటిని విద్యార్థులచేత చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. విద్యార్థి నైపుణ్యాలను పరిశీలించి అందుకు అనుగుణంగా వారికి తర్ఫీదును అందించాలని చెప్పారు. ముఖ్యంగా చేతిరాత బాగుండే విధంగా వారిని తీర్చిదిద్దాలని కోరారు. అజ్జాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. మంచి మార్కులు ఏవిధంగా సాధించాలనేదానిపై వారికి సూచనలు అందజేశారు. మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లు ఇవ్వండి సారూ..!



తన సమస్యను చెప్పుకునేందుకు కలెక్టరేట్ వద్ద కూర్చున్న సత్యవతి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బెలగాంకు చెందిన గొబ్బి సత్యవతి తనకు హౌసింగ్ బిల్లు కావాలని పలుమార్లు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేది. అయినా ఫలితం దక్కకపోవడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు భర్త, పిల్లలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. సొంత ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో ఇంటి నిర్మాణం ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పునాదులు వేసి గోడలు కట్టేవరకు బిల్లులు పడ్డాయని, శ్లాబ్ పూర్తి చేసిన బిల్లులు పడకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, కనీసం ఎవరూ స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

ఎన్‌టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



డీఎం హెచ్‌ఓ విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఎన్‌టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు నిమ్మకాయల రాజ్‌కమల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకాన్ని ఇన్సూరెన్స్ విధానంలో మార్పుచేసిన తరువాత పథకంలో పనిచేస్తున్న సిబ్బంది అందరినీ 17 సంవత్సరాల సర్వీసు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అందరికీ సమాన పనికి సమాన వేతనం అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ట్రస్టు ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్‌టైం ఎగ్జామ్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విధుల్లో చనిపోయిన వ్యక్తికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అలాగే రిటైర్ అయిన, అవుతున్న సిబ్బందికి రూ.10లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పరశురాం సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యాదీవెన బకాయి అందించండి

- కలెక్టరేట్ వద్ద విద్యార్థుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: తమకు బకాయి ఉన్న విద్యాదీవెన పథకం నిధులు జమచేయాలంటూ విద్యార్థులు పార్వతీపురం కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరంలో పీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించామని, ప్రభుత్వం కోటాలో ఉచిత ఉన్నత విద్య పథకమైన జేవీడీ ద్వారా 20మంది విద్యార్థులు ప్రవేశం పొందామన్నారు. రూ.82,600 ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం దక్కలేదని వాపోయారు. ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఈ పథకంపై ఎటువంటి హామీ ఇవ్వకపోవడం బాధాకరమని ఆందోళన వెళ్లగక్కారు. ఈ విషయాన్ని పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం దక్కలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయాల పాలైన శంకరరావు

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి, బండిదొరవలస రహదారి పరిధిలో సోమవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు రూరల్ ఎస్సై బి. సంతోషి తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం మరుపెంట గ్రామానికి చెందిన గంట శంకరరావు వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా కృష్ణపల్లి బండిదొరవలస గ్రామాల మధ్య ఉన్న రహదారిలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో శంకరరావుకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పార్వతీపురం రూరల్: మండలంలోని చినమరికి నుంచి ఒడిశాకు ఆటోలో పదిబస్తాల్లో 480 కేజీల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం ఆంధ్రా నుంచి ఒడిశా రాష్ట్రానికి పార్వతీపురం పట్టణానికి చెందిన నడుకూరి నాగు అనే వ్యక్తి అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై చెప్పారు. ఈ కేసుకు సంబంధించి ఆటోతో పాటు 10 బస్తాల్లో ఉన్న పీడీఎస్ బియ్యాన్ని సీజ్‌చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ..?



పింఛన్ అందజేయాలని కలెక్టరేట్ వద్ద బైఠాయించిన బిల్లమాడు గ్రామానికి చెందిన దరఖాస్తుదారులు

పార్వతీపురం టౌన్: తమకు పింఛన్లు కావాలని వృద్ధులు, దివ్యాంగులు తొమ్మిది నెలలుగా నిరీక్షిస్తున్నారు. ఈ మేరకు సోమవారం భామిని మండలంలోని బిల్లమాడు గ్రామానికి చెందిన 19మంది లబ్ధిదారులు తమకు పింఛన్లు అందడం లేదంటూ స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. తమకు పింఛన్ పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నా సచివాలయానికి వెళ్తే సైట్ తెరుచుకోవడం లేదని చెబుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచి తక్షణమే పింఛన్లు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బిల్లమాడు గ్రామానికి చెందిన పెన్షన్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో ప్రపంచ వినికిడి దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కర్ రావు

పార్వతీపురం టౌన్: పరిమితికి మించిన శబ్దాలు వినడం ద్వారా వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా డీఈఐసీ(జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం)లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికత జీవన శైలిలో ప్రతి ఒక్కరూ వినికిడి సామర్థ్యానికి అవరోధం లేకుండా జాగ్రత్తపడాలని, చెవులను సురక్షితంగా ఉంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఒక స్థాయికి మించిన శబ్దాలు తరచూ వినడం వల్ల మన చెవిలో వినికిడి వ్యవస్థ దెబ్బతిని క్రమేణా వినగలిగే సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల వినికిడి వ్యవస్థ మరింత సున్నితంగా ఉంటుందని వారి పట్ల అత్యంత శ్రద్ధ అవసరమని, సెల్‌ఫోన్స్, ఇయర్ ఫోన్స్ పిల్లలకు ఎక్కువగా అలవాటు చేయకూడదని హితవు పలికారు. అవసరమైన వారు శబ్దసౌలభ్య నాణ్యమైన ఇయర్ ఫోన్స్ వాడడం, ఎప్పటికప్పుడు చెవి తనిఖీలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందుగా గుర్తించి తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చని తెలిపారు. జిల్లా ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ పీఎల్. రఘుకుమార్ మాట్లాడుతూ డీఈఐసీలో శిబిరాల నిర్వహణ, అలాగే ప్రతిరోజూ ఓపీ ద్వారా పిల్లల్లో వినికిడి సమస్యలను ముందుగానే గుర్తించి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, వైద్యాధికారి డాక్టర్ లలిత, ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీనారాయణ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.